నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, శనివారం 17 ఆగస్టు 2024 VIKARABAD

## ఎట్టకేలకు బల్దియాలో కదలిక

**'డబుల్' ఇండ్ల మౌలిక వసతుల కల్పనకు టెండర్లు**

సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : డబుల్ బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతుల కల్పనపై జీహెచ్ఎంసీ అధికారుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. నిధుల లేమితో ఇంతకాలంగా సౌకర్యాలు కల్పించడంపై దృష్టి పెట్టలేదు. దాదాపు రూ. 200 కోట్ల మేర నిధులను జలమండలికి కేటాయించాల్సి ఉన్నప్పటికీ మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలోనే లబ్ధిదారులంతా కొన్ని నెలలుగా భారీ ఎత్తున ఇందిరాపార్కు, జలమండలి, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఇటీవల జరిగిన ప్రజావాణిలో మేయర్, కమిషనర్‌ను ఘెరావ్ చేసి.. మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు హామీ ఇచ్చిన కమిషనర్.. ప్రాధాన్యతాక్రమంలో డబుల్ బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతుల కల్పనకు సిద్ధమయ్యారు. ఈ మేరకు వాటర్ సప్లయి, డ్రైనేజీ , లిఫ్టులు, కరెంట్, రహదారులు, ఇతర సదుపాయాల పనులకు టెండర్లను ఆహ్వానించారు. కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు నియోజకవర్గాల్లోని డబుల్ బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతులు కల్పించనున్నారు.

# హ్యాండిచ్చింది..

- మూడో విడుతలోనూ చాలామంది రైతులకు నిరాశే
- శుక్రవారం సాయంత్రానికి సైతం జిల్లా అధికారులకు అందని అర్హుల జాబితా
- నేటికీ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న మొదటి, రెండో విడుత రైతులు
- అందరికీ న్యాయం జరుగుతుందంటూ బుకాయింపు
- మాఫీ కాలేదని అధికారులకు వెల్లువెత్తుతున్న వినతులు



వికారాబాద్, ఆగస్టు16 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ అమలుకు పెట్టిన నిబంధనలతో ఎంతోమంది అన్నదాతలు నష్టపోయారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేయగా.. జిల్లావ్యాప్తంగా 1.26 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరింది. కానీ ప్రస్తుతం కేవలం లక్షలోపు రైతులకే మేలు జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలను పరిగణనలోకి తీసుకుంటే.. కాంగ్రెస్ సర్కార్ మాత్రం రేషన్‌కార్డును ప్రామాణికంగా రుణమాఫీ చేసింది. దీంతో సుమారు 70 వేల మందికిపైగా రైతులు నష్టపోయారు. జిల్లాలో రూ.2 లక్షలలోపు రుణమాఫీతో 91,956 మంది రైతులకు మాత్రమే లబ్ధి చేకూరింది. మొదటి విడుతలో 46,633 మంది రైతులకుగాను రూ.256.26 కోట్లు, రెండో విడుతలో 26,438 మందికి రూ.265.04 కోట్లు, చివరి విడుతలో 18,885 మందికి రూ.247.71 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. పట్టాదారు పాసుపుస్తకాల ఆధారంగా రుణమాఫీ చేసినట్లయితే.. జిల్లాలో సుమారు లక్షా70 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరేదని.. రేషన్ కార్డును ముడిపెట్టడంతో అర్హులైన రైతులకు అన్యాయం జరిగిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పైన డబ్బులు చెల్లిస్తేనే రూ.2 లక్షలలోపు రుణమాఫీ...

రుణమాఫీకి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన నిబంధనలతో చాలామంది రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ.2 లక్షలలోపు రుణమాఫీ పూర్తి కావాలంటే రూ.2 లక్షలకుపైన రుణాలు తీసుకున్న రైతులు ఆ పైన ఉన్న డబ్బులను చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నది. దీంతో రైతులు పైన డబ్బును చెల్లించేందుకుగాను వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే పంట పెట్టుబడికి అప్పులు చేసిన రైతులు, ఇప్పుడు రుణమాఫీ వర్తించేందుకూ అప్పులు చేస్తుండడం భారంగా మారింది. ఒకవైపు రుణాలను మాఫీ చేస్తున్నామంటూనే తిరిగి రైతుల నుంచి ముక్కు పిండి వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలిచ్చి ఇప్పుడు నట్టేట ముంచుతుందని రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### వేలల్లోనే ఫిర్యాదులు...

రుణమాఫీ కాలేదంటూ జిల్లా వ్యవసాయ కార్యాలయాలకు రైతులు ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. రుణమాఫీ కాని రైతుల సంఖ్య అధిక మొత్తంలో ఉండడంతో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేయడంతోపాటు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని టెక్నికల్ సెక్షన్, మండల వ్యవసాయాధికారి కార్యాలయం, క్షేత్రస్థాయిలో క్లస్టర్ల వారీగా ఏఈవోలను రుణమాఫీ కాని రైతుల విజ్ఞప్తులను స్వీకరిస్తున్నారు. జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్న ప్రకారం ఇప్పటివరకు రుణమాఫీ కాలేదని 2500లకుపైగా రైతుల నుంచి ఫిర్యాదులు అందినట్లు చెబుతున్నారు. పేరు ఒకరిది ఆధార్ నంబర్ మరొకరిది ఉండడం, రైతుల పేర్లు తప్పుగా నమోదు చేయడం.. ఆధార్‌లో ఉన్న పేరుకు పట్టాదారు పాసు పుస్తకంలో ఉన్న పేరు ఒకేలా ఉండకపోవడం.. వంటి కారణాలతో చాలా మంది రైతులు నష్టపోయారు. జిల్లాలో ఇప్పటివరకు వచ్చిన గ్రీవెన్స్‌లో 70 శాతం వరకు ఆధార్ నంబర్ సరిలేకపోవడం, రేషన్‌కార్డు లేకపోవడం, రైతు పేరును తప్పుగా ఎంట్రీ చేయడం వంటి ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయి. కొన్ని బ్యాంకులు ఇచ్చిన జాబితాలో తప్పుగా ఎంట్రీ చేయడంతోనే చాలా మంది రైతులు అర్హులైనప్పటికీ రుణమాఫీ కాలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇందుకు ఆధార్ నంబర్ సరిలేకపోవడం(మిస్ మ్యాచ్), వీటిలో కుటుంబ నిర్ధారణ కాకపోవడం(రేషన్ కార్డులేకపోవడం) ఫిర్యాదులే అధికంగా ఉన్నాయి. రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం ఎప్పుడో పూర్తయిప్పటికీ, బ్యాంకర్లు ప్రభుత్వానికి అందజేసే రైతుల వివరాలను నమోదు చేసే సమయంలో తప్పుగా ఎంట్రీ చేయడంతోనే రైతులు నష్టపోవాల్సి వచ్చింది. అయితే గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వానికి వివరాలను అందజేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు కొత్త రేషన్ కార్డులు జారీ చేయకుండానే ప్రభుత్వం రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకొని రుణమాఫీ ప్రక్రియను చేపట్టడం, మరోవైపు రైతుల వివరాలను తప్పుగా ఎంట్రీ చేయడంతో జిల్లాలో అర్హులైన సుమారు 70 వేలకుపైగా రైతులు నష్టపోయారు. మూడో విడుత రుణమాఫీని ప్రకటించిన మరుసటి రోజుననే శుక్రవారం బదిలీలు అయినవారందరినీ రిలీవ్ చేయాలని ఆఘమేఘాల మీద ప్రభుత్వం ఆదేశించింది. దీంతో రుణమాఫీ కాలేదని కార్యాలయాలకు వచ్చిన రైతులకు సమాధానం చెప్పేవారే లేకుండా పోయారు.



పట్టుబడ్డ నిందితులు

## చేజ్.. గంజాయి సీజ్!



కారులో నుంచి గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

**- కిలోమీటర్ల కొద్దీ వాహనాల్లో వెంబడించి..**

**- సినీ ఫక్కీలో నిందితుల పట్టివేత**

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 16: అది రద్దీగా ఉండే విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారి. శుక్రవారం మధ్యాహ్నం దాదాపు 12.30 గంటలు కావొస్తున్నది. పంతంగి టోల్‌గేట్ వైపు నుంచి మితిమీరిన వేగంతో కారు దూసుకొస్తున్నది. అప్పటికే వచ్చిన సమాచారంతో హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు.. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల సహకారంతో మండలకేంద్రంలోని రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలో రోడ్డుకు అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. బారికేడ్లను చూసి హైవేపై హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే మార్గంలోకి రాంగ్‌రూట్‌లోకి కారును పోనిచ్చారు. ఇంకేముంది.. మళ్లీ చేజ్.. ఆ ముందుకురాగానే కారును హైవేకు ఆనుకుని ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వైపు మళ్లించారు. పోలీసు వాహనాలు ఆ కారును వెంబడించాయి. చివరకు తప్పించుకునే క్రమంలో కారు వేగంగా స్తంభాన్ని ఢీకొట్టింది.. అందులోని నలుగురిని పోలీసులు పట్టుకున్నారు.. ఇదంతా క్రైమ్ సిరీస్‌లలోని ఎపిసోడ్‌లా జరిగిపోయింది. తేరుకునేలోపే మళ్లీ పోలీసు వాహనాలన్నీ వెళ్లిపోయాయి..

వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం ఖమ్మ, భద్రాచలం ప్రాంతాల నుంచి నలుగురు నిందితులు గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో నల్లగొండ టాస్క్ ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో నిందితులను వెంబడించారు. విజయవాడ జాతీయ రహదారిపై పంతంగి టోల్ గేట్ దగ్గర ఎర్టిగా కారులో వస్తున్న నిందితులను పట్టుకునే ప్రయత్నం చేశారు. కానీ, నిందితులు టోల్‌గేట్ దగ్గర వాహనాన్ని ఆపకుండా, గేట్‌ను ఢీకొట్టి తప్పించుకున్నారు. అధికారులు వెంటనే హయత్‌నగర్ ఎక్సైజ్‌తోపాటు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలో హైవేకు అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే, బారికేడ్లను గుర్తించిన నిందితులు కారును రాంగ్‌రూట్‌లోకి మళ్లించారు. హైవేపై దాదాపు 500 మీటర్లు రాంగ్ రూట్‌లో వెళ్లి ఆ తర్వాత జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వైపు మళ్లారు. అటునుంచి బయటకు వెళ్లిపోవొచ్చని భావించారు. కానీ, కాలనీకి ప్రవేశమార్గం, తిరిగి వెళ్లేమార్గం ఒకటేననే విషయం వారికి తెలియదు. కారు దాదాపు 150 కిలోమీటర్ల వేగంతో కాలనీలోకి వీధుల్లో చక్కర్లు కొట్టింది. కాలనీ వాసులు కొద్దిసేపు భయభ్రాంతులకు గురయ్యారు. అప్పటికే కాలనీ ప్రవేశమార్గం వద్ద పోలీసులు తమ వాహనాలతో మోహరించారు. అతివేగంలో కారును వెనక్కి తిప్పే క్రమంలో నిందితులు స్తంభాన్ని ఢీకొట్టారు. జాతీయరహదారిపై మొబైల్ వెహికిల్ కానిస్టేబుల్ వారిని పట్టుకునే ప్రయత్నంలో గాయపడ్డాడు. ఆ వెంటనే పోలీసులు నిందితులను పట్టుకున్నారు. కారులోని రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నల్లగొండ జిల్లాకు తరలించినట్టు స్థానిక పోలీసులు తెలిపారు.



యూరియా కోసం లైన్లో నిరీక్షిస్తున్న రైతులు

## యూరియా కోసం తప్పని తిప్పలు

- రైతు సేవా సహకార సంఘం వద్ద గంటల తరబడి లైన్‌లో నిరీక్షణ
- కొందరికే దొరకడంతో నిరాశతో వెనుదిరిగిన మిగిలిన రైతులు
- కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మళ్లీ కష్టాలు మొదలయ్యాయని ఆగ్రహం

తాండూరు, ఆగస్టు 16 : కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వికారాబాద్ జిల్లా తాండూరు మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం వద్ద శుక్రవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. తాండూరు మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారు 300 నుంచి 400 మంది రైతులు ఉదయమే సహకార సంఘం వద్దకు వచ్చి లైన్‌లో నిలబడి యూరియా కోసం పడిగాపులు కాశారు. గంటల తరబడి లైన్‌లో నిరీక్షించారు. అయినా రైతులందరికీ యూరియా బస్తాలు దొరకక ఇబ్బందిపడ్డారు.సందర్భంగా పలువురు రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తానన్న మార్పు ఇదేనా అంటూ మండిపడ్డారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచని ఈ ప్రభుత్వం ఉన్నా ఒక్కటే.. లేకున్నా ఒకటేనన్నారు. మళ్లీ ఉమ్మడి రాష్ట్రంలోని పాత రోజులు గుర్తుకొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో చాలామంది రైతులు తప్పని పరిస్థితిలోపరిస్థితిలో యూరియా కోసం ప్రైవేట్ దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



వాహనాలతో రైతుల నిరీక్షణ

## నేడు రాష్ట్రవ్యాప్తంగా ఓపీ సేవలు బంద్

**పశ్చిమ బెంగాల్ ఘటనకు వైద్యుల నిరసన**

**శుక్రవారం సైతం విధులు బహిష్కరించి.. ర్యాలీలు**

సిటీబ్యూరో/ఖైరతాబాద్, సుల్తాన్‌బజార్: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ.. శనివారం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో ఓపీ సేవలను బహిష్కరిస్తున్నట్లు ఆలిండియా మెడికల్ అసోసియేషన్ న్యూస్ లెటర్ ఎడిటోరియల్ బోర్డ్ మెంబర్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు సాయిరాం వెల్లడించారు. అత్యవసర సేవలు యథావిధిగా కొనసాగుతాయని, ఓపీ సేవలు మాత్రం ఒక్కరోజు నిలిపివేస్తున్నామన్నారు. కాగా, బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ.. శుక్రవారం గాంధీ దవాఖానలో జూడాలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారికి మద్దతుగా తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం, గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ భూపేందర్ సింగ్ రాథోడ్, కార్యదర్శి డాక్టర్ అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. నిమ్స్‌లోనూ రెసిడెంట్ వైద్యుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు 48 గంటల నిరసన కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఓపీ సేవలతో పాటు శస్త్రచికిత్సలను నిలిపివేశారు. సుమారు 400 మందికి పైగా వైద్య సిబ్బంది తమ విధులను బహిష్కరించి ఆందోళన బాటపట్టారు. 34 విభాగాలకు చెందిన వైద్య, ఇతర సిబ్బంది సేవలను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల నుంచి ఉస్మానియా దవాఖాన వరకు జూడాలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. భారీ ర్యాలీ నిర్వహించారు.





అధికారులకు సూచనలిస్తున్న పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్

## రెండు షిఫ్టుల్లో చెత్త సేకరణ

**అధికారులకు పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశం**

**పారిశుధ్య పనుల ఆకస్మిక తనిఖీ**

**రోడ్లపై గుంతలు పూడ్చకపోవడంపై మండిపాటు**

సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణను గాడిలో పెట్టేందుకు పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ప్రత్యేక దృష్టి సారించారు. 'పారిశుధ్య నిర్వహణలో జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంపై 'ఏడి చెత్త ఆడనే' శీర్షికన శుక్రవారం 'నమస్తే' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. స్పందించిన పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా జర్నలిస్టు కాలనీలోని పాలపిట్ట సర్కిల్ పరిసర ప్రాంతాల్లో రహదారులపై ఉన్న ప్యాచ్ వర్క్స్ చేయకుండా వదిలేసిన గుంతలను పరిశీలించారు. స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ పనులు చేపట్టినా ఎప్పటికప్పుడు రోడ్డు పునరుద్ధరణ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆదే ప్రాంతంలో వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించి సంపు నిర్మించేందుకు అనువైన ప్రాంతాన్ని చూడాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. వ్యర్థాలు ఎక్కువగా ఉత్పన్నమయ్యే ప్రాంతాల్లో రెండు షిఫ్టుల్లో చెత్త సేకరణ జరపాలని అధికారులకు దానకిశోర్ ఆదేశాలు జారీ చేశారు.

**కార్మికులతో ఇంటరాక్షన్**

వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న గార్బేజీ వనరబుల్ పాయింట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. జూబ్లీహిల్స్ రోడ్ నం. 45, రోడ్ నం. 70 గౌతంనగర్ బస్తీ, దీన్ దయాళ్‌నగర్ బస్తీ, ఫిలింనగర్, పీఈటీ పార్కు ప్రాంతాల్లో తరచూ చెత్త వేసే ప్రాంతాలను దానకిశోర్ పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్ఎఫ్ఏ, పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనితీరును వివరాలు ఆరా తీశారు. కార్మికుల హాజరు తదితర వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్యలుంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలని కార్మికులకు దానకిశోర్ చెప్పారు. పనివేళల్లో తప్పనిసరిగా యూనిఫాం, హ్యాండ్ గ్లౌజ్‌లు ధరించి రక్షణ చర్యలు పాటించాలన్నారు. నగరంలో చెత్త ఎక్కువగా ఉత్పన్నమయ్యే ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అలాంటి ప్రాంతాల్లో రెండు షిఫ్టుల్లో చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం పలు ప్రాంతాల్లో నిర్మిస్తున్న నీటి నిల్వ సంపుల పనులను పరిశీలించారు.

### 'దోమల నివారణ చర్యలు వేగవంతం చేయండి'

సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : దోమల నివారణకు చేపట్టే యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చర్యలపై కాలనీ వారీగా షెడ్యూల్ తయారు చేయాలని కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అడిషనల్, జోనల్ కమిషనర్లతో ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దోమల నివారణ చర్యలపై షెడ్యూల్ తయారు చేసి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.



కడ్తాల్‌లో..

## వరలక్ష్మీ నమోస్తుతే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలు, ఇండ్లలో అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉపవాసం ఉండి అమ్మ వారికి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మ వారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

## విద్యుత్ డిమాండ్.. 72. 8 మిలియన్ యూనిట్లు

**వానకాలంలోనూ రెట్టింపైన కరెంటు వినియోగం**

**ఉక్కపోతతో పెరిగిన ఫ్యాన్లు, ఏసీల వాడకం**



సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): వేసవిలో ఎండల తీవ్రతతో ఉక్కపోతతో ఇబ్బందులు పడటం సాధారణమే అయినా.. అలాంటి పరిస్థితి ఇప్పుడు వర్షాకాలంలోనూ కనిపిస్తున్నది. ఒకవైపు వర్షాలు కురుస్తున్నా.. మరోవైపు ఉక్కపోతతో నగరవాసులు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. నిరంతరం ఫ్యాన్లు, ఏసీలు లేనిదే ఉండలేకపోతున్నామని నగరవాసులు వాపోతున్నారు. ఆగస్టు నెలలోనే వరసగా వర్షాలు కురుస్తున్నా.. మధ్యలో ఉక్కపోత ఎక్కువ ఉండటంతో విద్యుత్ వినియోగం సైతం ఒక్కసారిగా పెరిగింది. ఆగస్టు 4న గ్రేటర్‌లో 60.3 మిలియన్ యూనిట్ల వినియోగం ఉండగా, ఆగస్టు 14న 72.8 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. ఈ పది రోజుల వ్యవధిలోనే సుమారు 12 మిలియన్ యూనిట్ల దాకా పెరిగింది. పైగా ఇదే నెలలో అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రత 33 డిగ్రీలుగా నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సాధారణంగా వర్షాకాలంలో 30 డిగ్రీల లోపే ఉంటుంది. ఉష్ణోగ్రత పెరగడానికి ప్రధాన కారణం ఉపరితల ఆవర్తనమని అధికారులు పేర్కొంటున్నారు.

## బిల్లుల చెల్లింపునకు థర్డ్ పార్టీ యాప్స్

సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): విద్యుత్ వినియోగదారులు బిల్లుల చెల్లింపును సులభతరం చేసేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ (టీజీఎస్‌పీడీసీఎల్) సంస్థ చర్యలు చేపట్టింది. డిజిటల్ చెల్లింపులు పెరగడంతో చాలా మంది అందుబాటులో ఉన్న మొబైల్ యాప్‌ల ద్వారానే తమ బిల్లులు చెల్లిస్తున్నారు. గత జూలై నుంచి పలు కారణాలతో థర్డ్ పార్టీ యాప్‌ల నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి టీజీఎస్‌పీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా కడుతున్నారు. అయితే లక్షలాది మంది వినియోగదారులు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి యాప్‌ల ద్వారా చెల్లించేందుకు అలవాటుపడిన క్రమంలో సంస్థ యాప్, వెబ్‌సైట్ ద్వారా చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. డిస్కం పరిధిలో మొత్తం కోటికి పైగా విద్యుత్ వినియోగదారులు ఉండగా, అందులో 60 శాతం మంది ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపులు చేస్తున్నారు. డిజిటల్ పేమెంట్స్‌కు ప్రజలు ఎక్కువగా థర్డ్ యాప్‌లను వినియోగిస్తున్నట్లు గుర్తించిన అధికారులు.. ఆదిశగా చర్యలు చేపట్టారు.ఆగస్టు నెలాఖరు నాటికి ఎంపిక చేసిన మొబైల్ యాప్‌ల ద్వారా చెల్లింపులు చేసే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.